వాయిస్ టుడే
జనగాత్రం - మీనచేత్రం
హైదరాబాద్
సోమవారం, 8 జనవరి, 2024

గుంటూరు కారం ట్రైలర్ వచ్చేసింది

మహేష్‌బాబు అభిమానులకు పండగే..

ఈ సంక్రాంతికి ఎన్ని సినిమాలు విడుదలవుతున్నా కూడా అందరి దృష్టి మహేష్ బాబు హీరోగా వస్తున్న గుంటూరు కారంపైనే ఉంది. అతడు, ఖలేజా లాంటి కల్ట్ సినిమాల తర్వాత దర్శకుడు త్రివిక్రమ్, మహేష్ బాబు కాంబినేషన్లో వస్తున్న మూడో సినిమా కావడంతో ఫ్యాన్స్‌లో భారీ అంచనాలే ఉన్నాయి. నాగవంశీ నిర్మాణ సారథ్యంలో వస్తున్న ఈ చిత్రం ఈనెల 12న విడుదల కానుంది. తాజాగా ఈ చిత్ర ట్రైలర్‌ను మేకర్స్ విడుదల చేశారు. అభిమానుల అంచనాలకు తగ్గట్టే ట్రైలర్ అదిరిపోయింది. దాదాపు 20 ఏళ్ల తర్వాత మహేష్ బాబు మళ్ళీ ఫుల్ మాస్ అవతారంలో కనిపిస్తున్నాడు. 17 సంవత్సరాల తర్వాత స్మోకింగ్ సీన్స్ ఈ సినిమాలోనే చేశాడు. అతిథి తర్వాత ఈయన స్మోకింగ్ సీన్స్ ఏ సినిమాలో చేయలేదు. కానీ మళ్ళీ గుంటూరు కారం కోసమే బీడీ ముట్టుకున్నాడు మహేష్ బాబు. దానికి తోడు సినిమాలో మహేష్ బాబు క్యారెక్టర్ కూడా ఫుల్ కమర్షియల్ మాస్ మసాలాగా ఉంది. కొన్ని సంవత్సరాలుగా సూపర్ స్టార్ అభిమానులు ఎలా అయితే చూడాలనుకుంటున్నారో అలాగే త్రివిక్రమ్ చూపించాడు.

కంటెంట్ ఉన్న సినిమాలకే ఆదరణ

'హనుమాన్' చిత్ర ప్రీ రిలీజ్ వేడుక ఆదివారం హైదరాబాద్ లో ఘనంగా జరిగింది . తేజ సజ్జ కథానాయకుడిగా ప్రశాంత్ వర్మ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం ఈ నెల 12న ప్రేక్షకుల ముందుకురానుంది . ప్రీ రిలీజ్ వేడుకకు మెగాస్టార్ చిరంజీవి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడిన అ యన సంక్రాంతి సినిమాల విడుదలపై కీలక వ్యాఖ్యలు చేసారు. చిరంజీవి మాట్లాడుతూ 'సంక్రాంతి సినిమాలకు పరీక్షాకాలం.. హను-మాన్ చిత్రానికి థియేటర్లు దొరకడం లేదని నిర్మాతలు బాధపడ్డారు. థియేటర్ల విషయంలో నిర్మాతలు బాధపడాల్సిన అవసరం లేదు. కంటెంట్ ఉన్న చిత్రాలను ప్రేక్షకులు తప్పకుండా చూస్తారు. మొదటి రోజు కాకపోతే రెండో రోజు, కుదరకపోతే మూడో రోజు చూస్తారు.

దిల్ రాజు సినీ పరిశ్రమలో ఎంతో అనుభవం ఉన్న వ్యక్తి.. ఆయనకు ఈ సీజన్ లో ఏ సినిమాకు ఎన్ని థియేటర్లు ఇవ్వాలో తెలుసు. ఖైదీ నెం.150 సమయంలో 'శతమానంభవతి ' విడుదల చేశారు. శతమానంభవతి రిలీజ్ కొంచెం ఆలస్యం చేయవచ్చు కదా అని దిల్ రాజును అడిగాను. రెండు పెద్ద సినిమాల మధ్య మా సినిమా కూడా ప్రేక్షకులు చూస్తారని దిల్ రాజు చెప్పాడు. దిల్ రాజు చెప్పినట్లే శతమానంభవతి బాగా ఆడింది. ఇప్పుడు హను-మాన్ కూడా బాగా ఆడుతుంది. సంక్రాంతికి విడుదలయ్యే అన్ని సినిమాలు ఆడాలి, పరిశ్రమ పచ్చగా ఉండాలి' అన్నారు . రామ మందిర నిర్మాణం చారిత్రక ఘట్టమని, రామాలయ ప్రారంభోత్సవానికి తనకు ఆహ్వానం అందిందని , కుటుంబ సభ్యులతో కలిసి ఆ ఉత్సవానికి హాజరు కాబోతున్నానని చిరంజీవి తెలిపారు. హనుమాన్ సినిమా టికెట్స్ పై ప్రతి ఐదు రూపాయలను రామ మందిరానికి విరాళంగా ఇస్తామని చిత్ర బృందం పేర్కొంది.

యాక్షన్ ప్యాక్డ్‌గా ధనుష్ 'కెప్టెన్ మిల్లర్' ట్రైలర్

కోలీవుడ్ స్టార్ హీరో ధనుష్ టైటిల్ రోల్‌లో నటిస్తోన్న తాజా చిత్రం కెప్టెన్ మిల్లర్ . యాక్షన్ థ్రిల్లర్ జోనర్‌లో తెరకెక్కుతున్న ఈ చిత్రానికి అరుణ్ మథేశ్వరన్ దర్శకత్వం వహిస్తుండగా.. కోలీవుడ్ భామ ప్రియాంక అరుళ్ మోహన్ ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. ఈ మూవీ సంక్రాంతి కానుకగా జనవరి 12న గ్రాండ్‌గా విడుదల కానుంది. విడుదల తేదీ దగ్గర పడటంతో ఇప్పటికే ఈ సినిమా నుంచి టీజర్‌తో పాటు సాంగ్స్ విడుదల చేయగా ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. ఇదిలావుంటే.. తాజాగా ఈ సినిమా నుంచి మేకర్స్ ట్రైలర్ విడుదల చేశారు.

ఈ ట్రైలర్ గమనిస్తే.. ఇండియన్ ఇండిపెండెన్స్ కు ముందు జరిగిన స్టోరీ అని తెలుస్తుంది. బ్రిటీష్ పాలన నుంచి తన ప్రాంతాన్ని రక్షించే స్థానిక నాయకుడిగా ధనుష్ ఇందులో కనిపించబోతున్నాడు. ఇక ట్రైలర్ చూస్తుంటే.. భారీ యాక్షన్ సన్నివేశాలు ఉన్నాయని తెలుస్తుంది. మరోవైపు రిలీజ్ డేట్ దగ్గర పడుతున్న నేపథ్యంలో ధనుష్ కెప్టెన్ మిల్లర్‌కు సెన్సార్ బోర్డు క్లీన్ యూ/ఏ సర్టిఫికెట్ జారీ చేసింది. సెన్సార్ అప్‌డేట్ ప్రకారం కెప్టెన్ మిల్లన్ రన్ టైం 157 నిమిషాలు (2 గంటల 37 నిమిషాలు). శివకార్తికేయన్ నటిస్తోన్న అయలాన్ కూడా ఇదే రోజు విడుదల కానుండటంతో.. తమిళనాడు బాక్సాఫీస్ వద్ద రెండు చిత్రాలు పోటీ పడనున్నాయి. కెప్టెన్ మిల్లర్ ఫస్ట్ సింగిల్ కిల్లర్ కిల్లర్ నెట్టింటిని షేక్ చేస్తోంది. ఈ సాంగ్‌లో ధనుష్ కెప్టెన్ మిల్లర్‌గా ఎర్రటి స్కార్ఫ్ కట్టుకొని చేతిలో తుపాకీతో అగ్రెసివ్ లుక్‌లో కనిపిస్తూ అంచనాలు పెంచుతున్నాడు.

ట్రెండ్ సెట్ చేసే గ్యాంగ్‌స్టర్ డ్రామా

ఇండియన్ స్క్రీన్‌పై ఇప్పటివరకూ వచ్చిన మాఫియా నేపథ్య కథలకు పూర్తి భిన్నంగా పవన్‌కల్యాణ్ 'ఓజీ' కథ ఉంటుందని మేకర్స్ చెబుతున్నారు. గ్యాంగ్‌స్టర్ డ్రామాగా రూపొందుతోన్న ఈ చిత్రంలో పవన్‌కల్యాణ్ కేరక్టరైజేషన్ ఊహలకు అందని విధంగా ఉంటుందని, అత్యంత శక్తివంతంగా ఆయన పాత్రను దర్శకుడు సుజిత్ డిజైన్ చేశారని యూనిట్ సభ్యులు చెబుతున్నారు. ఈ సినిమాలో కీలక పాత్ర పోషిస్తున్న నటుడు వెంకట్ మాట్లాడుతూ 'పవర్‌స్టార్ అభిమానులకు 'ఓజీ' విందుభోజనం లాంటి సినిమా. ఇందులో మంచి పాత్ర చేస్తున్నాను. 'అన్నయ్య' సినిమాలో చిరంజీవిగారి తమ్ముడిగా నటించిన నేను ఈ సినిమాలో పవన్‌కల్యాణ్‌తో కలిసి నటిస్తుంటే 23ఏళ్ల క్రితం 'అన్నయ్య' రోజులు గుర్తొస్తున్నాయి. ఇందులో కొన్ని సీన్స్ అభిమానులకు గూజ్‌బమ్స్ తెప్పిస్తాయి. టాలీవుడ్‌లో ఈ సినిమా కొత్త ట్రెండ్ సృష్టిస్తుంది' అని తెలిపారు. జపాన్, ముంబై నేపథ్యంలో ఈ సినిమా కథ సాగుతుందని సమాచారం. ప్రియాంక అరుళ్ మోహన్ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో ఇమ్రాన్ హష్మీ, అర్జున్ దాస్, శ్రీయారెడ్డి, ప్రకాశ్‌రాజ్ ఇతర పాత్రధారులు. ఈ చిత్రానికి సంగీతం: తమన్, నిర్మాత: డీవీవీ దానయ్య, నిర్మాణం: డీవీవీ ఎంటర్‌టైన్‌మెంట్స్

నేను ఉద్వేగపూరితంగా చేసిన సినిమాలన్నీ హిట్

నా తొలి సినిమా నుంచే వైజాగ్‌తో విడదీయరాని అనుబంధం ఏర్పడిపోయింది. నా 75వ సినిమా ఎమోషనల్ మూవీ కావడం ఆనందంగా ఉంది. నేను ఉద్వేగపూరితంగా నటించిన శత్రువు, ధర్మచక్రం, గణేశ్.. ఇలా ప్రతి సినిమా హిట్. ఇది కూడా పక్కా హిట్' అని వెంకటేశ్ నమ్మకం వ్యక్తం చేశారు. ఆయన హీరోగా రూపొందిన చిత్రం 'సైంధవ్'. శైలేష్ కొలను దర్శకుడు. వెంకట్ బోయనపల్లి నిర్మాత. ఈ చిత్రం ప్రీరిలీజ్ ఈవెంట్ వైజాగ్‌లో జరిగింది. డైరెక్టర్ మాట్లాడుతూ 'ఇప్పటివరకూ చూడని కొత్త వెంకటేశ్‌ని ఇందులో చూస్తారు. ఈ సినిమా తర్వాత వెంకీ అభిమానిని అయిపోయాను. వెంకటేశ్‌గారి 75వ సినిమాను దర్శకత్వం చేసే అవకాశం రావడం నా అదృష్టం. అందరం ప్రాణంపెట్టి పనిచేశాం' అని అన్నారు. ఇంకా చిత్రబృందం పాల్గొన్నారు.

ప్రేమలోని కొత్త కోణం..

కార్తీక్‌రాజు, మోక్ష, షెర్రీ అగర్వాల్ నాయకానాయికలుగా నటిస్తున్న చిత్రం 'ఐ హేట్ యు'. అంజి రామ్ దర్శకుడు. శ్రీగాయత్రి ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై నాగరాజ్ నిర్మిస్తున్నారు. చిత్రీకరణ పూర్తయింది. దర్శకుడు మాట్లాడుతూ 'లవ్ సైకాలజీని ఆవిష్కరిస్తూ ఈ చిత్రాన్ని తెరకెక్కించాం. ప్రేమలోని కొత్త కోణాన్ని తెలియజేస్తుంది. ప్రేమకథా చిత్రాల్లో సరికొత్త పంథాలో తెరకెక్కించాం. ప్రస్తుతం పోస్ట్‌ప్రొడక్షన్ కార్యక్రమాలు జరుగుతున్నాయి. త్వరలో విడుదల తేదీని ప్రకటిస్తాం' అన్నారు. ఈ చిత్రానికి కెమెరా: ఎస్.మురళీమోహన్ రెడ్డి, సంగీతం: సాకార్, కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం: అంజి రామ్.

రొమాంటిక్ యాక్షన్ ఎంటర్‌టైనర్

రాజ్‌తరుణ్, మాల్వి మల్హోత్రా జంటగా నటిస్తున్న చిత్రం 'తిరగబడరసామీ'. ఎ.ఎస్.రవికుమార్ చౌదరి దర్శకుడు. సురక్ష్ ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై మల్కాపురం శివకుమార్ నిర్మిస్తున్నారు. ఈ సినిమా చిత్రీకరణ పూర్తయింది. ఫిబ్రవరిలో విడుదల చేయబోతున్నారు. 'జహీరాబాద్ పరిసర ప్రాంతాల్లో ఎక్కువ భాగం చిత్రీకరణ జరిపాం. యువతను మెప్పించే ప్రేమకథ, ఫ్యామిలీస్‌ను ఆకట్టుకునే సెంటిమెంట్, మాస్ మెచ్చే యాక్షన్ అంశాలతో ఈ సినిమాను తీర్చిదిద్దుతున్నాం.

కామెడీని ఎంజాయ్ చేస్తారు

చంద్రశేఖర్, సోనాలి జంటగా కే సంతోష్‌బాబు దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం "ప్లాంట్ మాన్'. పన్నారాయల్ దర్శకత్వ పర్యవేక్షణ చేస్తూ నిర్మించారు. ఇటీవలే విడుదలైన ఈ చిత్రం సక్సెస్‌మీట్‌ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివారం చిత్రబృందం సక్సెసమీట్‌ను నిర్వహించింది. దర్శకుడు మాట్లాడుతూ 'చిన్న సినిమాకు పెద్ద విజయాన్ని ఇచ్చిన ప్రేక్షకులకు ధన్యవాదాలు. ఈ చిత్రంలో కామెడీని ప్రేక్షకులు బాగా ఎంజాయ్ చేస్తున్నారు. రోజురోజుకూ వసూళ్లు పెరుగుతున్నాయి' అన్నారు. పన్నారాయల్ మాట్లాడుతూ 'నేను నిర్మాతగా చేసిన తొలి చిత్రమే హిట్ టాక్ తెచ్చుకున్నందుకు ఆనందంగా ఉంది. ఇంత సక్సెసను నేను ఊహించలేదు. ఈ ఉత్సాహంతో ఏటా రెండు సినిమాలు చేస్తాను' అని చెప్పారు. మంచి సినిమాలో భాగమైనందుకు ఆనందంగా ఉందని సోనాలి తెలిపారు.

షారుఖ్‌తో యాక్షన్ సినిమా



బాలీవుడ్ బాద్షా షారుఖ్‌ఖాన్ కెరీర్‌లో గత ఏడాది చిరస్మరణీయంగా నిలిచిపోతుంది. పఠాన్, జవాన్, డంకీ చిత్రాలతో హ్యాట్రిక్ విజయాలు దక్కాయి. అందులో పఠాన్, జవాన్ చిత్రాలు వేయి కోట్ల వసూళ్ల మైలురాయిని దాటడం విశేషం. ఈ నేపథ్యంలో షారుఖ్‌ఖాన్ తదుపరి సినిమాపై అందరిలో ఆసక్తి ఏర్పడింది. ఆయన మరో యాక్షన్ సినిమావైపే మొగ్గు చూపుతున్నారని వార్తలు వినిపిస్తున్నాయి. దీనికి కరణ్‌జోహార్ దర్శకత్వం వహించబోతున్నారని తెలిసింది. తన కెరీర్‌లో ఇప్పటివరకు కరణ్‌జోహార్ యాక్షన్ సినిమా చేయలేదు. దాంతో ఈ వార్త బాలీవుడ్‌లో చర్చనీయాంశంగా మారింది.